క్లుప్తంగా

నగదు ప్రోత్సాహకం అందజేత



జక్రాన్‌పల్లి: పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గోర్తి ఈశ్వర ట్రస్టు ఆధ్వర్యంలో పదవ తరగతి టాపర్లకు నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ట్రస్టు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు పాటుకూరి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ట్రస్టు వ్యవస్థాపకులు ఉషాబాల పవన్ కుమార్ సహకారంతో పదవ తరగతిలో టాపర్లుగా నిలిచిన హర్షిక, శంకర్‌లకు రూ.12,500 చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సురేందర్ రెడ్డి, వీడీసీ సభ్యుడు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అకాడమీ ఎక్స్‌లెన్స్ అవార్డు



నిజామాబాద్‌అర్బన్: టీవీయూవీ ఆధ్వర్యంలో జులై 1న అకాడమీ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా కన్వీనర్ అజయ్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇంటర్‌లో అధిక మార్కులు సాధించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం చేయడం జరుగుతుందని అన్నారు. అవార్డు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ ముదిరాజ్ వస్తున్నారని తెలిపారు. నేతలు నవీన్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

లలితాదేవి ఆశ్రమంలో కోటి పుష్పార్చన



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని న్యాల్‌కల్ రోడ్డులో గల లలితాదేవి ఆశ్రమంలో శుక్రవారం కోటి పుష్పార్చన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మహా అన్నప్రసాదం అందజేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

హెచ్‌టీ సర్వీసుల తనిఖీ



నిజామాబాద్‌నాగారం: నగరంలో ఉన్న హెచ్‌టీ సర్వీసులను విద్యుత్ విజిలెన్సు డీఈ ప్రభాకర్‌రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌టీ సర్వీస్ పొందుతున్న వినియోగదారుల నుంచి సమాచారాన్ని సేకరించే ఉద్దేశంతో తనిఖీ నిర్వహించామన్నారు. మీటర్ చెకింగ్, లోపాలు లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా అధికారుల దృష్టికి తేవాలన్నారు.

రింగ్ రోడ్డు నిర్మించాలి



సిరికొండ: వర్జిన్ తండా మీదుగా మిగతా తండాలను కలుపుతూ రింగ్ రోడ్డును నిర్మించాలని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి విన్నవించారు. హైదరాబాదులో ఎమ్మెల్యేను వారు శుక్రవారం కలిశారు. రోడ్డు విషయంలో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బాణావత్ మోజీరామ్, మాజీ సర్పంచ్ సంగ్లు, తదితరులున్నారు.

బొగ్గు గనులను సింగరేణి సంస్థకు కేటాయించాలి



ఖలీల్‌వాడి: బొగ్గు గనుల వేలంపాటను ఆపి సింగరేణికి కేటాయించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, విగ్నేష్, నగర కమిటీ సభ్యులు కటారి రాములు, నరసయ్య, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

పరిపాలన గాలికొదిలేశారు

- ఢిల్లీ చుట్టూ సీఎం ప్రదక్షిణలు కొడుతున్నారు
- అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చింది గాడిద గుడ్డు
- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శ



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పక్కన కార్పొరేటర్లు

సుభాష్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో పరిపాలనను గాలికొదిలేసి ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని నిజామాబాద్ అర్బన్ బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తీవ్రంగా విమర్శించారు. సీఎం సీటు కాపాడుకోవడానికి ఆరు నెలల్లో 11 సార్లు ఢిల్లీకి వెళ్లారని, సమయమంతా సోనియా, రాహుల్ చుట్టూ తిరగడానికే సరిపోతుందని ఎద్దేవా చేశారు. శుక్రవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గాడిద గుడ్డు ఫ్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలియజేశారు. అనంతరం ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం, గొర్రెల పంపిణీ, ఫోన్ ట్యాంపిగ్ కుంభకోణాల నుంచి కేసీఆర్‌ను తప్పించడానికి, బీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేయడానికి సోనియాతో రేవంత్ పావులు కదుపుతున్నారని ఆరోపించారు. విద్యారంగ సమస్యలను గాలికొదిలేసి ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలపై చర్యలేవని ప్రశ్నించారు.

ఏబీవీపీ నేతలపై దాడులు.. కేసులు

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏబీవీపీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తే పోలీసులతో దాడులు చేయడం, కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, నాయకులకు గులాంగిరి చేస్తే జిల్లా విడిచిపెట్టి వెళ్లిపోవాలని, ప్రజల కోసం పని చేస్తేనే ఉండాలని హెచ్చరించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సొంత జిల్లాలో చెంచు మహిళపై అత్యాచారం జరిగిందని, రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పార్టీ ఫిరాయింపులపై ఉన్న శ్రద్ధ ప్రజలు, పాలనపై ఎందుకు పెట్టడం లేదని సీఎంను ప్రశ్నించారు. రైతు భరోసాపై నేటికీ స్పష్టత లేదని, పంట బోనస్, రుణమాఫీ పేరుతో కాలయాపన చేస్తూ రైతులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ఎలాంటి షరతులు లేకుండా ఏక కాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాలకు ఆరు నెలల్లో ఒక్క రూపాయి నిధులు కేటాయించిన పాపాన పోలేదని, అర్బన్ నియోజక వర్గానికి రేవంత్‌రెడ్డి ఇచ్చింది గాడిద గుడ్డు అని ఎద్దేవా చేశారు. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పార్లమెంట్ సాక్షిగా జై పాలస్తీనా అనడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు నాగోళ్ల లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, నారాయణ యాదవ్, భరత్ భూషణ్, మాస్టర్ శంకర్, సాయివర్ధన్, రాజు, బద్దం కిషన్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలను తొలగించాలి



రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న యువతీయువకులు

నిజామాబాద్‌నాగారం: రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రముఖ వైద్యులు బొద్దుల రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. జమాల్పూర్ విఠల్ వ్యాస్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం దివంగత జర్నలిస్టు విఠల్ వ్యాస్ 4వ వర్ధంతి సందర్భంగా నిజామాబాదు రెడ్ క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజేంద్ర ప్రసాద్ హాజరై మాట్లాడారు. ఆరోగ్య వంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. షుగర్ కంట్రోల్ ఉన్న వారు సైతం రక్తదానం చేయవచ్చన్నారు. 15 మంది యువతీ,యువకులు రక్తదానం చేశారు. డాక్టర్లు ధన్‌పాల్ వినయ్, శ్రీశైలం, భరత్, సొసైటీ అధ్యక్షుడు జమాల్పూర్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కనీస సదుపాయాలు కల్పించండి



మాట్లాడుతున్న ఐద్వా మహిళా నాయకులు

నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్‌లో కనీస సదుపాయాలు కల్పించాలని ఐద్వా మహిళ సంఘం జిల్లా కార్యదర్శి సుజాత, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్‌ను కోరారు. ఈమేరకు వినతి పత్రం అందజేశారు. సుజాత మాట్లాడుతూ..జీజీహెచ్‌లో చాలా రకాల మాత్రలు లేవన్నారు. గర్భిణీలకు సంబంధించి స్కానింగ్ సెంటర్‌లో తప్పుడు రిపోర్టులు రావడం, వారికి రక్తస్రావం అవుతున్నా కూడా నిర్లక్ష్యం వహించడం సరి కాదన్నారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది, వచ్చిన పేషెంట్స్‌తో దురుసుగా ప్రవర్తించడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రిలో సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనిత, ఉపాధ్యక్షురాలు లావణ్య ఉన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మరమ్మతులు



ఖలీల్‌వాడిలో చేసిన మరమ్మతులు

సుభాష్‌నగర్: నగరంలోని ఖలీల్‌వాడిలో గల రోడ్లపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు, అంబులెన్స్ వెళ్లేందుకు ఇబ్బందులపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రత్యేక దృష్టిసారించారు. ఆస్పత్రులు ఉన్న కారణంగా రోగులు, వారి బంధువులు, ఇతరత్రా పనుల నిమిత్తం వచ్చే వారితో నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది. అనేక వినతుల దృష్ట్యా ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. లేకుంటే తన సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేయిస్తానని స్పష్టం చేశారు. స్పందించిన మున్సిపల్ అధికారులు ఖలీల్‌వాడితోపాటు నగరంలోని పలు డివిజన్లలో రోడ్డు మరమ్మతులు చేపడుతున్నారు.

మహిళలకు రక్షణగా షీ టీమ్



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృంద సభ్యులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలోని మహిళల భద్రత కోసం షీ టీమ్స్ పని చేస్తున్నాయని ఏఎస్సై రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ మాధవీలత సూచించారు. శుక్రవారం కంజర్ శివారులో గల టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ బాలికల పాఠశాలలో పోలీస్ కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాటిక, పాటల ద్వారా చైతన్యం పెంపొందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత గంజాయి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. మొబైల్ దొంగిలించినా.. పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేస్తున్నామన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, దీనికి సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేయాలని తెలిపారు. నకిలీ గల్ఫ్ ఏజెంట్ల మాయమాటలతో నిరుద్యోగులు మోసపోవద్దని, సమాజంలో జరుగుతున్న నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు.

ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం



ఎంపీపీ దంపతులను సన్మానిస్తున్న అధికారులు



విద్యార్థులను సన్మానిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

జక్రాన్‌పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కుంచాల విమల రాజు, వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. జులై 4న ఎంపీటీసీలు, ఎంపీపీల పదవీ కాలం ముగుస్తుండడంతో ఎంపీటీసీ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్ కుమార్, తహసీల్దార్ కిరణ్మయి, ఏవో దేవిక, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు..

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర స్థాయి మానసిక వైద్యుల సదస్సులో భాగంగా నిర్వహించిన క్విజ్‌లో జిల్లా వైద్య విద్యార్థులు శ్రీసూర్య, అబ్దుల్ రఫీ ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచినందుకు శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ సన్మానించారు. క్విజ్‌లో రాష్ట్రంలోని 35 వైద్య కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వైద్య విద్యార్థులు కర్నాటకలో జరిగే సౌత్ జోన్ క్విజ్ పోటీలకు తెలంగాణ తరపున ఎంపికయ్యారు. మానసిక వైద్య విభాగాధిపతి శివ ప్రసాద్, మానసిక వైద్యులు రాజేందర్, రాజశేఖర్, ప్రదీప్‌కుమార్‌లున్నారు.

దళితుల అభ్యున్నతికి చంద్రబాబు పాటు పడాలి



నిజామాబాద్‌నాగారం: ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన కేసును సుప్రీం కోర్టు 2004లోనే కొట్టివేసిందని, ఇప్పటికైనా ఏపీ సీఎం చంద్రబాబు వర్గీకరణను పక్కన పెట్టి దళితుల అభ్యున్నతికి పాటు పాడాలని మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు హితబోధ చేశారు. శుక్రవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాట్లాడారు. చంద్రబాబు, కొన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణ పేరుతో దళితులకు అన్యాయం చేయాలని చూస్తున్నాయన్నారు. మాలమహానాడు నాయకులు కిష్టయ్య, ధన్‌రాజ్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

3న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా

నిజామాబాద్‌నాగారం: జులై 3న వైద్య శాఖ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిర, జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌ను కలిసి వినతి పత్రం అందించి మాట్లాడారు. వారు మాట్లాడుతూ..జీవో-60 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చలేదన్నారు. యూనియన్ నాయకులు హైమది బేగం, భాగ్యలక్ష్మి, కవిత, రోజా పాల్గొన్నారు.

బీసీజీ సర్వే నిలిపివేయాలని వినతి

నిజామాబాద్‌నాగారం: పారితోషకం లేని బీసీజీ సర్వే రద్దు చేయాలని శుక్రవారం సీఐటీయు జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఆశావర్కర్లు డీఎంహెచ్‌వో డాక్టర్ తుకారాం రాథోడ్‌కు వినతిపత్రం అందజేశారు. నూర్జహాన్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రయోగాత్మకంగా బీసీజీ సర్వే పేరుతో కొత్త సంస్కరణ తీసుకురావడం వల్ల పనిభారం పెరిగిందని, ఉన్న పనులు చేయడానికి ఆశావర్కర్లకు సమయం – శక్తి సరిపోవటం లేదన్నారు. కొత్త కొత్త సంస్కరణలు రాష్ట్ర హెల్త్ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఎగ్జామ్ విధానాన్ని, బీసీజీ సర్వే విధానాన్ని అమలు చేయాలని ఆశా కార్యకర్తలను ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశా యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక, జిల్లా ఉపాధ్యక్షులు లలిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మిక శాఖ మంత్రిని నియమించకపోవడం బాధాకరం

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఆర్నెళ్లు గడిచినా భవన నిర్మాణ కార్మికుల గురించి ఇంతవరకు కార్మిక శాఖ మంత్రిని నియమించకపోవడం బాధాకరమని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కల్లెడి గంగాధర్, పట్టణ అధ్యక్షుడు బాబురావులు అన్నారు.తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌ఆర్ చౌరస్తాలో వారు ధర్నా నిర్వహించి కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. కల్లెడి గంగాధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. నేతలు వేణు, ఆరిఫ్, రామాంజనేయులు, కార్మికులు శ్రీనివాస్, సత్యం, రమేష్, పోశెట్టి, ఎల్లయ్య తదితరులున్నారు.

నూతన వీడీసీ ఎన్నిక



సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ) నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా కోడిగెల ఆనంద్ ఎన్నికయ్యారు. ఆయనతోపాటు 25 మంది సభ్యులను ఎన్నుకున్నారు.



ఎల్లమ్మగుట్టలో రోడ్డుపై లీకేజీ అవుతున్న తాగునీరు

'లీకేజీతో తాగునీరు వృథా..'

నగరంలోని ఎల్లమ్మగుట్ట చౌరస్తా నుంచి కోర్టుకు వెళ్లే దారిలో ప్రధాన రోడ్డుపై పైప్‌లైన్ లీకేజీ అవుతోంది. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. పైపులైన్‌ను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్– నిజామాబాద్

పీవీ నర్సింహారావు సేవలు మరువలేనివి



పీవీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి



బోర్గం(పి) చౌరస్తాలో.. మేయర్ నీతూకిరణ్

సాక్షి నెట్‌వర్క్:మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని శుక్రవారం జిల్లాలో నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, ఇతర పార్టీలు నేతలు మాట్లాడుతూ.. పీవీ నర్సింహారావు చేసిన సేవలు మరువలేమని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన నిపుణుడని కొనియాడారు.



జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, సుడా మాజీ చైర్మన్ ప్రభాకర్



సిరికొండలో .. ఉపాధ్యాయులు

తప్పుడు కేసుపై హైకోర్టును ఆశ్రయిస్తాం



మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ నేత సబ్బని లత

ఖలీల్‌వాడి: బీఎల్ఎఫ్ నేత దండి వెంకట్‌పై పెట్టిన తప్పుడు కేసును ఎత్తివేయాలని పోలీస్ ఉన్నతాధికారులకు బహుజన లెఫ్ట్ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సబ్బని లత విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నగరంలోని అతిథి గృహంలో ఆమె మాట్లాడారు. సుభాష్ నగర్ ప్రాంతానికి చెందిన మహిళకు కుటుంబ సమస్యలు ఉండటంతో దండి వెంకట్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన వెళ్లినట్లు చెప్పారు. ఇద్దరం వెళ్లాల్సి ఉండగా ఇంటి స్థలాల విషయంలో గిరిరాజ్ కళాశాల ముందు ఉన్న ఖాళీ స్థలంలో పేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని ధర్నా చేశామని, దీనితో వెంకట్ ముందు వెళ్లారని చెప్పారు. మహిళ ఇంట్లో ఉండటమే తప్పైందని, అకారణంగా కేసులు పెట్టి పోలీసులు వేధిస్తున్నారని అన్నారు. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు, హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. నాయకులు తిట్టి రాజు, మేకల రాజేందర్, జి.యాదయ్య, మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం.. నోటీసులు జారీ

- వారం రోజుల్లో వివరాలు ఇవ్వాలని ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: నిర్మాణాల్లో భద్రత చర్యలేవి..? అనే కథనానికి మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. నగరంలోని ద్వారకానగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవన యాజమాన్యానికి టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. నిర్మాణం విషయంలో చుట్టు పక్కల భవనానికి ఇబ్బందులు కలిగాయి. సెల్లార్ అనుమతి లేకున్నా ఎందుకు నిర్మాణం చేపడుతున్నారో పూర్తి వివరాలు అందజేయాలన్నారు. వారం రోజుల్లో ఇచ్చిన నోటీసుకు జవాబు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. లేకుంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డిచ్‌పల్లి: మండలంలోని 33/11కేవీలో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సాయిలు శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్డ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	73,000	వెండి (కిలో)	92,000
22 క్యారెట్స్	67,340	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	40	60	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	100
బీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	15	30	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	80	100	గోబిగడ్డ	25	50
కాకరకాయ	50	75	గోబిపువ్వు	60	80
వంకాయ	15	30	బీట్‌రూట్	30	60
పాలకూర	30	50	కరివేపాకు	40	70
మెంతికూర	70	100	చామగడ్డ	40	60
కొత్తిమీర	70	100	గోరుచిక్కుడు	60	80
పుదీనా	60	90	చిక్కుడుకాయ	70	100
క్యాప్సికం	60	80			

- సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(తెలుగు)-11.20, 2.55,6.30,10.05
స్క్రీన్-2	కల్కి-2898 ఏడీ(తెలుగు) -10.00
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు) -11.50, 3.25,7.00,10.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు)-8.00, 11.45, 3.30,7.15,11.00
స్క్రీన్-2	కల్కి-2898 ఏడీ(3డీ తెలుగు) -10.45, 2.30,6.15,10.00 మహారాజ(తెలుగు)-1.00,7.45
స్క్రీన్-3	కల్కి-2898 ఏడీ(తెలుగు)-5.40, 9.10,12.40,7.10,10.40 మహారాజ(తెలుగు)- 4.10
స్క్రీన్-4	కల్కి-2898 ఏడీ(తెలుగు)-8.30, 12.15
	కల్కి-2898 ఏడీ(హిందీ)- 6.45,10.30 ముంజ్య(హిందీ)- 4.00
దేవి	కల్కి-2898 ఏడీ(తెలుగు)
నటరాజ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)
విజయ్	కల్కి-2898 ఏడీ(తెలుగు)